క్లుప్తంగా

ఆగస్టు 12న శతాధిక కవి సమ్మేళనం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళావేదిక సభ్యులు

లేపాక్షి: రాష్ట్ర యువజన విభాగం, శ్రీసత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 12వ తేదీన లేపాక్షి ఎంపోరియంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ శతాధిక కవి సమ్మేళనం జరుగుతుందని శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడు వడ్డీ సుధాకర్, జిల్లా అధ్యక్షుడు దాదిగిరి నరేష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయంలో లేపాక్షి కవితా వైభవం పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తి మండ్రప్రతాప్ సారథ్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కవి సమ్మేళనానికి పెద్ద ఎత్తున కవులు, మేథావులు హాజరై లేపాక్షి కవితా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు

మడకశిరరూరల్: రేకులకుంట మహాత్మజ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండ కుండా చర్యలు చేపట్టామని ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, సర్పంచ్ అంజినమ్మ ఆదివారం తెలిపారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేశారన్నారు. ఇటీవల పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సిద్ధేశ్వర స్వామి

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాలైన శిరా, హిరియూర్, పావగడ, తుమకూరు, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు.

రొళ్ల: టీడీ పల్లి గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. స్వామి మూల విగ్రహాన్ని గంగా జలంతో అభిషేకించారు. స్వామి ప్రతిమకు వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. భక్తులు తరలివచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుత్ తీగలు సరిచేయండి


కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న వ్యక్తి

మడకశిరరూరల్: ఎం రంగాపురం గ్రామ సమీపంలో రంగప్ప పొలంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఎం రంగాపురం గ్రామం నుంచి మణూరు గ్రామానికి లాగిన విద్యుత్ చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతు రంగప్ప ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ప్రమాదం జరగక ముందే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నాడు.

మణిపూర్ ఘటన అమానుషం


మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

హిందూపురం: మణిపూర్‌లో మహిళలపై జరిగిన హింసాత్మక సంఘటనలు అమానుషమని జనవిజ్ఞాన వేదిక సత్యసాయి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈటీ రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి ధర్మవరం డాక్టర్ ఆదిశేషు అన్నారు. ఆదివారం స్థానిక అల్‌హిలాల్ స్కూల్ జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, శాంతియుత వాతావరణం కల్పించేందుకు కృషి చేయలని కోరారు. అకృత్యానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెవీవీ నాయకులు రామకృష్ణా, అతావుల్లా, ప్రభాకర్, రామకృష్ణ, అబ్దుల్‌హక్, అతీవుల్లా, మడకశిర హరి, పెనుకొండ చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మవరం అనిల్, ఉమామహేష్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలతోనే పేదల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి


మండలపల్లిలో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా పేదలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని మందలపల్లి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జల్లులు వర్షం పడుతున్న గొడుగు పట్టుకొని ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వెళ్లకుండగానే ప్రభుత్వ పథకాలు తమ ఇంటి వద్దకే అందుతున్నాయని మహిళలు, లబ్ధిదారులు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత ఉన్నవారికి వలంటీర్ ద్వారా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నారన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకొంటేనే అభివృద్ధి, పథకాలు అన్నీ సక్రమంగా అందుతాయని వివరించారు. ప్రతి ఇంటికీ కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్ జగన్‌దేనని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తౌసీఫ్‌ఖాన్, కృష్ణమూర్తి, రమేష్, రాయుడు, రంగనాథ్, డీలర్ రాజు,హనుమంతరాయ, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన


గుమ్మయ్యగారిపల్లి పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

గోరంట్ల: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఆదివారం పరిశీలించారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదరరెడ్డి, ఉపాధ్యాయులు ఆయన్ను కలిశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల గౌరవాధ్యక్షుడు విద్యాసాగర్, అధ్యక్షుడు నరేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వరరెడ్డి, నాగేనాయక్, రంగారెడ్డి, మురళి, నాగేంద్ర, మోహన్‌రెడ్డి, వెంకట్రాముడు, శివారెడ్డి, రమేష్, నరసింహరెడ్డి నాగరాజు, రవీంద్ర, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే భవిష్యత్


వన సంరక్షణపై నాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

రొద్దం: ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు పెంచితేనే భవిష్యత్‌లో వాతావరణ కాలుష్యాన్ని నివారించొచ్చని వక్తలు అన్నారు. ఆదివారం మండలంలోని కోగిర వనసంరక్షణ ప్రాంతంలో కల్పవల్లి వృక్ష పెంపకందారుల పరస్పర సహాయ సహకార సంఘం 15వ వార్షిక మహాసభ నిర్వహించారు. పలువురు సంఘం సభ్యులు మాట్లాడుతూ టింబక్టు–కలెక్టివ్ సహకారంతో గత 33 ఏళ్లుగా ప్రజలతో ఉమ్మడి భూముల సంరక్షణ పునర్జీవన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గతేడాది జరిగిన కార్యక్రమాల నివేదిక, ఆడిట్ రిపోర్టు, కల్పవల్లి సొసైటీ పాలకవర్గ మార్పులు– చేర్పులు, మొగ్గ కార్యక్రమంపై చర్చించినట్లు తెలిపారు. అటవీ సంరక్షణపై చిన్నారులు ప్రదర్శించిన నాటకం అలరించింది. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మేరి వట్టవట్టం, గంగూలి, 11 గ్రామాల వనసంరక్షణ సభ్యులు, అధ్యక్షులు, డైరెక్టర్లు, టింబక్టు–కలెక్టివ్ సిబ్బంది, కల్పవల్లి సీఈఓ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా అందని పరిహారం


1బీ చూపుతున్న రైతు బోయ ముత్యాలప్ప

పెనుకొండ రూరల్: కియా పరిశ్రమకోసం భూమి తీసుకున్న రైతులకు ఆరేళ్లుగా పరిహారం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో కియా పరిశ్రమకు భూమి ఇచ్చిన రైతులకు ఎకరానికి రూ.10లక్షలు చొప్పున పరిహారం అందించారు. భూమి ఇస్తే పరిహారం అందుతుందని, పరిశ్రమలో ఉపాధి దొరుకుతుందని, తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందని అప్పట్లో రైతులు ఆశించారు. రెవెన్యూ అధికారులు అధికారికంగా తమ పట్టాదారు పుస్తకాన్ని స్వాధీనం చేసుకొని, భూమిని సైతం పరిశ్రమకు అప్పగించి, పరిహారం ఇవ్వకుండా మరిచారని బాధితులు అంటున్నారు.

వెంకటగిరి పాళ్యం చెందిన రైతు బోయ ముత్యాలప్ప మాట్లాడుతూ 2017లో కియా పరిశ్రమ కోసం ఎర్రమంచి పొలంలోని దుద్దేబండ సమీపంలో సర్వే నంబర్ 160–2, 161–5లలో తమ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. తమ భూమిలో పరిశ్రమకు అనుబంధంగా విద్యుత్ కార్యాలయం ఏర్పాటు చేశారని, పరిహారం కోసం ఆరేళ్లుగా తిరుగుతున్నా ఫలితంలేదన్నారు. సోమవారం తప్ప మిగిలిన రోజులు రెవెన్యూ అధికారులు ఫీల్డ్ పేరుతో విధులకు దుమ్మా కొడుతున్నారని, ఎన్ని సార్లు అధికారుల కోసం తిరిగినా ఫలితంలేదని రైతు వాపోయాడు.

వీఆర్‌ఓ ఏమంటున్నారంటే..

బాధిత రైతులకు భూ పరిహారం విషయంపై వీఆర్వో రమేష్ బాబును అడిగితే ఇదివరకే రైతు బోయ ముత్యాలప్ప చెందిన రెండు సర్వే నంబర్లలోని భూమి రికార్డులను ఉన్నతాధికారులకు పంపామని, వారి నుంచి ఇంకా ఉత్తర్వులు అందలేదని తెలిపాడు.

పేదలకు అన్నదానం

పెనుకొండ: పట్టణంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. కృష్ణదేవరాయ సర్కిల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక మంది పేదలు, గ్రామీణ ప్రజలకు అన్నదానంతో పాటు మంచి నీటి సౌకర్యం కల్పించారు. భక్తులు, గ్రామీణ ప్రజలు సత్యసాయి ప్రత్యేక భజనల్లో పాల్గొన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కవిత, ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

దేవదాయ భూమి ఆక్రమణ అవాస్తవం

హిందూపురం టౌన్: దేవదాయ భూమిని ఆక్రమించామనే ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తనపై ఆలయ ఈఓ నాగేంద్రుడు చేసిన భూ ఆక్రమణ ఆరోపణలపై న్యాయపరమైన సలహాలతో ముందుకు వెళ్తానని తెలిపారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. తాను ఏమైనా దేవదాయ భూములు కబ్జా చేసి ఉంటే కోర్టుకు వెళ్లాలన్నారు. లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

శ్మశానవాటిక రహదారికి మోక్షం


మానేపల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని మానేపల్లి గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గత 20 ఏళ్లుగా శ్మశాన వాటికలోకి వెళ్లడానికి, శవాలను దహనం చేయడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. శ్మశాన వాటికకు రహదారి ఏర్పాటు చేయాలంటూ ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన అధికారులు, నాయకులకు గ్రామస్తులు విన్నవించారు. ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల నిధులు చొప్పున మంజూరు చేసింది. అందులో భాగంగా సర్పంచ్ నిర్మల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్మశాన వాటికకు వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. సమస్య పరిష్కారం కావడంతో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శంకరప్ప, నాగరాజు, చలపతి, కిష్టప్ప, వెంకటేశ్, అశ్వర్థనారాయణ, సదాశివగౌడ్, అంజినప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పురానికి చేరుకున్న శివలింగం


శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీలోని ఆచలగురు ఆశ్రమంలో నిర్మిస్తున్న శివాలయంలో ప్రతిష్ఠించేందుకు తయారు చేయించిన ఆరు అడుగుల శివలింగాన్ని ఆదివారం పట్టణానికి తీసుకొచ్చారు. కర్ణాటకలోని మాలూరు సమీపంలో ఉన్న శ్రీవారి పట్టణంలో ప్రత్యేకంగా ఆరడుగుల శివలింగాన్ని తయారు చేయించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చిన శివలింగం, నంది, గణేష్ విగ్రహాలకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సడియెప్పన్ స్వామి, శ్రీనివాసులు, సత్యనారాయణ, సత్తి పాల్గొన్నారు.

పెట్టె అంగడి అగ్నికి ఆహుతి


అగ్ని కీలల్లో కాలిపోతున్న పెట్టె అంగడి

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నసముద్ర గ్రామంలో గుర్తు తెలియని ఆకతాయిల ఆగడాలకు పెట్టె అంగడి దగ్ధమైంది. బాధితుడు సదాశివ మాట్లాడుతూ శనివారం అర్ధ రాత్రి కొంతమంది ఆకతాయిలు తన పెట్టె అంగడికి నిప్పు పెట్టారని ఆరోపించారు. మంటలకు పెట్టె అంగడి పూర్తిగా కాలి పోయి అంగట్లోని సరుకులన్ని బూడిదై పోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా 6 నెలల్లోగా సదాశివకు చెందిన మూడు పెట్టె అంగళ్లను దుండగులు కాల్చి వేశారు. ఇప్పటికే ఒక బైకు కూడా దగ్ధం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు. వరుస అంగళ్ల దగ్ధం తో గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పీయూ కళాశాలకు బస్సు వితరణ


బస్సును ప్రారంభిస్తున్న ఎస్‌ఎస్‌కే పదాధికారులు

పావగడ: పట్టణంలోని ఎస్‌ఎస్‌కే శాంతి పీయూ కళాశాలకు స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచ్ అధికారులు బస్సు విరాళంగా అందించారు. కళాశాల ఆవరణంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్‌ఐసి డివిజనల్ మేనేజర్ పీఎస్ ఝా మాట్లాడుతూ కళాశాలకు ఉచితంగా అందిస్తున్న బస్సు ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు కేవి శ్రీనివాస్ మాట్లాడుతూ శనీశ్వరస్వామికి భక్తులు అందిస్తున్న కానుకలతో కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. అతి తక్కువ ఫీజులతో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎల్‌ఐసీ బీఎం శశిధర్, ఎస్ఎస్‌కే సంఘం పదాధికారులు ఆనంద రావు, అనిల్‌కుమార్, సుబ్బనరసింహ, మోహన్ కుమార్, సీఏఎమ్ వైఎస్ హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న డాక్టర్ చిరంజీవి

లేపాక్షి: మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఆర్ఎంపీ డాక్టర్లు ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డాక్టర్ వెంకట చిరంజీవి హెచ్చరించారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో ఆర్ఎంపీ డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఆపరేషన్లు లేదా ఇతర వైద్య సేవలు అందించరాదన్నారు. అయితే ఇటీవల కంచిసముద్రం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఆర్ఎంపీ లేపాక్షికి చెందిన యువకుడికి అందించిన వైద్యం వికటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

పావగడ: పట్టణం లోని ఎస్‌ఎస్‌కే సముదాయ భవనంలో ఈనెల 28 న నిర్వహించే విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి స్థానిక తాలూకా ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కమిటీ పదాధికారులు స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌ను ఆదివారం ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యేను సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం అర్బన్: హిందూపురం గ్రామీణ మండలం కిరికెర పంచాయతీ మిట్టమీదపల్లి గేట్ వద్ద ఆదివారం రామకృష్ణారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన నారాయణ హృదయాలయ వైద్యులు ఉచితంగా గుండె జబ్బులు, థైరాయిడ్, షుగర్, బీపీ, సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు.

రేపు వైద్యశిబిరం

పావగడ: స్థానిక తేజస్ లాడ్జి మీటింగ్ హాల్‌లో మంగళవారం తేజస్ చారిటబుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, బెంగళూరు ఎంఎస్ రామయ్య ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్ ఆదివారం తెలిపారు. శిబిరంలో ఎంఎస్ రామయ్య ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్యులు జనరల్ మెడిసన్, సాధారణ శస్త్ర చికిత్స, ఎముకలు, కీళ్ల నొప్పులు, స్త్రీ రోగాలు, ఈఎన్‌టీ, కంటి, దంత, చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలతో పాటు చికిత్సలు ఉచితంగా అందిస్తారన్నారు. వివరాలకు ట్రస్ట్ కార్యదర్శి గాయత్రిబాయి శంకరమూర్తి 9480348594లో సంప్రదించాలని సూచించారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. ఆచూకీ గుర్తించిన వారు ఎస్ఐ సెల్: 9440796817కు సమాచారం ఇవ్వాలని కోరాడు.

రాప్తాడు: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. రామినేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై గత నెల 24న రాత్రి 10: 15 గంటలకు పోలీస్ మూమెంట్ సమయంలో గుర్తు తెలియని వృద్ధుడు స్పృహ తప్పి పడి ఉండడాన్ని గమనించినట్లు తెలిపారు. అతన్ని 108 వాహనం ద్వారా అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారన్నారు. అతని జేబులోని ఆధార్‌కార్డులో ఉన్న వివరాలను బట్టి వెంకటేష్ మూర్తి (73), తండ్రి శ్యామ్ రావు, డోర్ నంబర్ 4–317, పెనుకొండ రోడ్డు, మడకశిర గ్రామం అని ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. ఆచూకీ గుర్తించిన వారు ఎస్ఐ సెల్: 9440796817కు సమాచారం ఇవ్వాలని కోరాడు.

వ్యక్తిపై కేసు నమోదు

పరిగి: మండలంలోని ఊటుకూరులో ఆదివారం జరిగిన దాడి ఘటనలో దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన బాబావలి అనే వ్యక్తి ఇంటికి వెళ్లి అదే గ్రామానికి చెందిన నవీన్ దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రజక మహాసభ పోస్టర్ల విడుదల

సోమందేపల్లి: పుట్టపర్తిలో ఆగస్టు 13న జరగబోవు రజక సంఘం జిల్లా మహాసభ పోస్టర్లను ఆ సంఘం నాయకులు ఆదివారం విడుదల చేశారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివప్ప మాట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. 50 ఏళ్ల వయసువారికి పింఛన్, ధోబీ ఘాట్, లాండ్రీ షాపులను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఆంజనేయుల, శ్రీనివాసులు శ్రీరాములు సంజీవ రాయుడు నారాయణ స్వామి, గణేష్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ రామచంద్రను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

పెనుకొండ రూరల్: రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్‌గా పొగాకు రామచంద్రను ప్రభుత్వం ఇటీవల నియమించడంతో వాల్మీకి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఆదివారం సన్మానించారు. అమ్మవారిపల్లిలోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమానికి అసోషియేషన్ నాయకులు శివయ్య, శివన్న, ఈశ్వరయ్య, ఆంజనేయులు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గజగౌరీ వ్రతం


గజగౌరీ వ్రతంలో పాల్గొన్న భక్తులు


హిందూపురం: వ్రతం ఆచరిస్తున్న మహిళలు

హిందూపురం: స్థానిక వాసవీ ధర్మశాలలో ఆదివారం గజగౌరీ వ్రతాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణ,. అర్చనలు, పూజల అనంతరం ఆలయ ముఖమండపంలో గజగౌరీ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు, కౌన్సిలర్ రాఘవేంద్ర, ప్రమీల, రూప, నాగలక్ష్మి పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్యులు గజగౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంకాలం వరకు పురోహితులు వివిధ పూజలు చేశారు. మాజీ మంత్రి ఎస్ రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

మండలంలో మోస్తరు వర్షం

చిలమత్తూరు: మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకూ మోస్తరు వర్షం కురిసింది. రుతుపవనాలు, అల్పపీడన ప్రభావంతో రోజంతా చిరు జల్లులు కురిశాయి. ఖరీఫ్‌లో పంటల సాగుకు పదును లభిస్తుందని రైతులు చెబుతున్నారు. ఈనెలాఖరు వరకూ వేరుశనగ సాగు చేసుకోవచ్చని వ్యవసాయాదికారులు తెలిపారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుకొండ: పట్టణంలో ఆదివారం స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 114వ జయంతి వేడుకలు మిట్టాంజనేయ స్వామి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది రామకృష్ణ, దండోరా రామాంజినేయులు, నారాయణస్వామి, రవికుమార్, టెంపో శీనా, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

రొళ్ల: మండలంలోని హొట్టేబెట్ట, రొళ్ల, బీజీ హళ్లి, హెచ్‌టీ హళ్లి, రత్నగిరి, అలుపనపల్లి ప్రాథమిక పాఠశాల పరిధిలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు మంగళవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. సమావేశాల్లో విద్యార్థులో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారి సామర్థ్యాలను మెరుగు పర్చేలా ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726